# సాక్షి
## కుమురం భీం
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025






### ముగిసిన వెంకటి ప్రస్థానం
బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన జాడి వెంకటి విప్లవ ప్రస్థానం అజ్ఞాతంలోనే ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. 8లో▸



### ‘గిరి’ పల్లెల్లో కానరాని ప్రగతి
గిరిజన పల్లెలు ప్రగతికి ఆమడదూరంలో నిలిచిపోతున్నాయి. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. 9లో▸

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.5 /25.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్‌వో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్‌వో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం క్రీడామైదానంలో శుక్రవారం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురువేందర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 120 మంది క్రీడాకారులు హాజరు కాగా, ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన 24 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో మహబూబాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ రాకేశ్, పీడీలు రాజశేఖర్, యాదగిరి, చిరంజీవి, శిరీష, సునీత, హరిక తదితరులు పాల్గొన్నారు.

### ‘రక్సౌల్’ రైలు తిరుపతి వరకు పొడగింపు
సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీహార్‌లోని రక్సౌల్ నుంచి చర్లపల్లి వరకే నడుస్తున్న రక్సౌల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి స్టేషన్ వరకు పొడగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 23నుంచి పొడగింపు అమల్లోకి రానుంది. ప్రస్తుతం బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రాంత వాసులు తిరుపతి వరకు రైలు ప్రయాణానికి వీలుగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతీ మంగళ, శనివారాల్లో సమయాల్లో రాకపోకలు సాగించే ఈ రైలు సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా వాసులకు సైతం ఉపయోగపడనుంది. మంచిర్యాలకు రాత్రి 12గంటలకు చేరుకునే ఈ రైలు ద్వారా చర్లపల్లితోపాటు తిరుపతి వరకు వెళ్లేందుకు వీలు కలిగింది.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ వసతిగృహాల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని హాస్టల్స్ డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వసంత్‌రావు, కోశాధికారి రాంబాయి, వర్కర్లు గంగుబాయి, జంగుబాయి, రాధాబాయి, లక్ష్మి, సదాశివ్, సంతోష్, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### 16న ఎంపిక పోటీలు
కౌటాల(సిర్పూర్): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, పీడీ హరికృష్ణ తెలిపారు. అండర్ -14లో బాలురు 51 కిలోలు, బాలికలు 48 కిలోలు, అండర్- 17లో బాలురు, బాలికలు 55 కిలోల విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురులకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులతో ఎంట్రీ ఫాం, బోనాఫైడ్‌పై సంతకంతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. భోజన వసతి కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు పీడీ హరికృష్ణను 91546 33533 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# పంటల డిజిటల్ సర్వే

- జిల్లాలోని 64 క్లస్టర్లలో 1,21,050 ఎకరాల్లో క్రాప్ సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు
- ఈ నెల 1 నుంచి అక్టోబర్ 20 వరకు కార్యక్రమం



వాంకిడి మండలం ఖమానలో పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

వాంకిడి(ఆసిఫాబాద్): పంటల వివరాలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభమైంది. ఏటా ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించి పంట వివరాలు నమోదు చేస్తుంది. అధికారులు రైతులతో మాట్లాడి పంట వివరాలు సేకరిస్తుండగా, అందులో కచ్చితత్వం ఉండటం లేదు. పంట ఉత్పత్తులు అమ్మకానికి వచ్చే సమయంలో కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యలు తలెత్తేవి. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం డిజిటల్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ విధానంతో క్లస్టర్ల వారీగా ఏఈవోలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఏఈవోలకు అందించింది. ఈ యాప్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా ఒక సర్వే నంబరులో ఏ పంట ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారనేది కచ్చితమైన వివరాలు తెలియనున్నాయి.

**క్లస్టర్‌కు రెండు వేల ఎకరాలు..**

జిల్లాలో మొత్తం 70 క్లస్టర్లు ఉండగా 64 క్లస్టర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే చేయనున్నారు. ఒక్కొక్క వ్యవసాయ విస్తరణ అధికారి 2000 ఎకరాల్లో డిజిటల్ సర్వే నిర్వహించాలి. మహిళా వ్యవసాయ విస్తరణ అధికారులుగా ఉన్న క్లస్టర్లలో 1800 ఎకరాలను సర్వే చేస్తారు. అయితే జిల్లా వ్యాప్తంగా 70 క్లస్టర్ల పరిధిలో మొత్తం 4.42 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ప్రస్తుతం చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా 1,21,050 ఎకరాలకు సంబంధించిన పంట వివరాలు నమోదు చేయనున్నారు. మిగిలిన పంట వివరాలను గతంలో మాదిరి సాధారణ సర్వే చేపడతారు. డిజిటల్ సర్వేతో పంట వివరాలు నమోదు చేస్తుండటంతో కచ్చితత్వం ఉండనుంది. పంట ఉత్పత్తులు క్రయవిక్రయాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

**4.42 లక్షల ఎకరాల సాగుభూమి..**

జిల్లాలో 4.42 లక్షల ఎకరాల్లో సాగు భూమి ఉంది. జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా రైతులు ఉండగా అత్యధికంగా పత్తి పంట పండిస్తున్నారు. 3.30 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుంది. వరి 56 వేల ఎకరాలు, కంది 36 వేల ఎకరాలు. మిగతా 23 వేల ఎకరాల్లో పెసర, కందులు, వేరుశనగ, ఆయిల్ పామ్, మొక్కజొన్న, మిర్చి, పండ్ల తోటలు, కూరగాయలు వంటి తదితర పంటలు సాగు చేస్తున్నారు.

**అక్టోబర్ 20 వరకు గడువు..**

పంట సాగులో కచ్చితత్వం కోసం ప్రభుత్వం డిజిటల్ సర్వే విధానాన్ని తీసుకువచ్చింది. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి వివరాలు నమోదు చేయాలి. ఒక సర్వే నంబరులో ఎన్ని రకాల పంటలు సాగు చేస్తున్నారో గుర్తించి వేర్వేరుగా సేకరిస్తారు. రైతు పేరు, సాగు చేస్తున్న పంట ఎన్ని ఎకరాల్లో ఉంది, రైతు ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, పంటకు సంబంధించిన ఫొటో వంటి వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ సర్వే అక్టోబర్ 20 లోగా పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఏఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. సర్వే అనంతరం వివరాలను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శిస్తారు. తద్వారా వివరాల నమోదులో తప్పిదాలు ఉంటే రైతులు పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. సవరణల అనంతరం తుది జాబితాను ప్రదర్శిస్తారు. దీని ద్వారా పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల సమయంలో ఇబ్బందులు తప్పనున్నాయి.

**గడువులోగా పూర్తి చేస్తాం**

జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే విజయవంతంగా కొనసాగుతోంది. అక్టోబర్ 20 తేదీలోగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచనలు చేశాం. ఒక్కొక్క ఏఈవో 2000 ఎకరాల్లో పంట వివరాలు నమోదు చేస్తారు. డిజిటల్ సర్వేతో పంట ఉత్తత్తుల కచ్చితమైన వివరాలు తెలుస్తాయి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

## ‘ఓపెన్’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించే ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జూనియర్ కళాశాల, పదో తరగతి వారికి బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు కొనసాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 63 మంది, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగే పదో తరగతి పరీక్షలకు 145 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**మెరుగైన వైద్య సేవలందించాలి**

తిర్యాణి(ఆసిఫాబాద్): రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని గిన్నెధరి ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, విష జ్వరాలను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశ్, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఉపాధిహామీ పథకం ఏపీవోలు, సెర్ప్ ఏపీఎంలు, హౌజింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఎన్నికల సంబంధిత అంశాలు, పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర అంశాలపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖలవారీగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుని, లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వందశాతం ప్రారంభించాలన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని, వర్షపు నీరు నిల్వ లేకుండా గుంతలు పూడ్చాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టే చర్యల్లో భాగంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో దత్తారావు, మైనార్టీ సంక్షేమ అధికారి నదీం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**యూడైస్‌లో వివరాలు నమోదు చేయాలి**

ఆసిఫాబాద్‌రూరల్: జూనియర్ కళాశాలల విద్యార్థుల వివరాలు యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వివరాలు యూడైస్ పోర్టల్‌తో సక్రమంగా నమోదు చేయాలని, సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రతీ కళాశాలలో ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం వందశాతం అమలు చేయాలన్నారు. కాలేజీల్లో వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఈఐవో కళ్యాణి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛపై దాడి

- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు సరికాదు
- మీడియాపై అణచివేత విధానాలపై ఖండన





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని న్యాయవాదులు, ఉద్యమ సంఘాల నాయకులు తెలిపారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగడం, ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్కడి పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని ఖండించారు. ప్రజల పక్షాన పని చేసే జర్నలిస్టుల గొంతును నొక్కేసేలా వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

**పత్రికా స్వేచ్ఛను కాలరాయొద్దు**



బెల్లంపల్లి: ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం పత్రిక రంగం. పత్రికల్లో నిరాధారణమైన, అసత్యమైన వార్తా కథనాలు వస్తే వివరణ కోరవచ్చు. సదరు పత్రిక బాధ్యతాయుతంగా వివరణ ఇవ్వకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. కానీ ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలు, అణచివేత విధానాలకు పాల్పడడం, అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదు. సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరైన విధానం కాదు. ఏదైనా సరే చట్టానికి లోబడి వ్యవహరించాలి. కానీ వేధింపులకు గురిచేసే ధోరణి ఏమాత్రం మంచిది కాదు. పత్రికా స్వేచ్ఛను కాలరాయాలనుకోవడం అవివేకం అవుతుంది.

– అంకెం శివకుమార్, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

**స్వేచ్ఛను హరించడమే..**



ఆదిలాబాద్‌టౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కును చంద్రబాబు ప్రభుత్వం కాలరాయడం సరికాదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మీడియాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజకీయ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలను ప్రచురిస్తే ఎడిటర్‌పై కేసులు పెట్టడం సరికాదు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– వెంకటేశ్, జేఏసీ కోకన్వీనర్

**కేంద్ర ప్రభుత్వం స్పందించాలి**



ఆసిఫాబాద్‌అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి దినపత్రిక ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జి, విలేకరులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాం. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దాడులను ఉపేక్షించొద్దు. దీని వెనుక రాజకీయ నాయకులు ఎవరున్నా విచారణ చేపట్టి శిక్షించాలి. ఏపీలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టి నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటు.

– దుర్గం దినకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే..**



ఆసిఫాబాద్‌అర్బన్: మీడియా స్వేచ్ఛకు ఆటంకం కలిగించొద్దు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మీడియాపై అణచివేతకు పాల్పడిన ఘటనలు లేవు. తప్పుడు వార్తలు రాస్తే వివరణ అడగాలి. అంతేగాని దౌర్జన్యానికి దిగడం సరికాదు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుంది. సాక్షి పత్రిక ఎడిటర్‌పై పెట్టిన కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– రాపర్తి రవీందర్, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

**మీడియా గొంతు నొక్కడం సరికాదు**



ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న మీడియా గొంతు నొక్కడం సరికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం అప్రజాస్వామికం. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం సరికాదు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకం.

– భగత్ మహేందర్, అడ్వకేట్

**సమాజం హర్షించదు**



ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అతి ముఖ్యమైంది. ఒకరు బహిరంగంగా చెప్పిన దానిని వార్తగా ప్రచురిస్తే సాక్షి పత్రిక ఎడిటర్‌పై కేసు పెట్టడం సమంజసం కాదు. కక్ష సాధింపు చర్యలను సమాజం హర్షించదు. రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్న ఈ ఘటనలను యావత్ సమాజం గమనిస్తూనే ఉంది. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం, తప్పుడు కేసులు పెట్టడం అప్రజాస్వామికం.

– బోగె ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

# జలం.. జర భద్రం!

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదులు
- నిండుగా చెరువులు, కుంటలు
- ఈత సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువకులు
- రక్షణ చర్యలు కల్పించడంలో యంత్రాంగం విఫలం



తాటిపల్లి వద్ద వార్ధా నదిలో స్నానాలు చేస్తున్న యువకులు(ఫైల్)

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రాథోడ్ అంకిత్(15) గత నెల 31న ఇద్దరు స్నేహితులతో కలిసి కోసిని డ్యాం చూసేందుకు వెళ్లాడు. అంకిత్ స్నానం చేసేందుకు డ్యాంలోకి దిగగా, లోతు ఎక్కువ ఉండడంతో నీటిలో గల్లంతై మృతి చెందాడు. చేతికందిన కుమారుడు ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది.

కౌటాల(సిర్పూర్): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగ, పెద్దవాగు నదుల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, బావులు కూడా నిండుగా ఉన్నాయి. ఈ సమయంలో యువకులు సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల వద్ద పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టడంతో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఏటా ఘటనలు పునరావృతమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ముఖ్యంగా కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల్లోని పెన్‌గంగ, ప్రాణహిత, వార్ధా నదుల వద్ద సాన్నాలకు వెళ్లిన యువకులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోవడం కుటుంబాల్లో విషాదం నింపుతోంది.

**ఏటా ప్రమాదాలు..**

ఖాళీ సమయాలు, సెలవు రోజుల్లో ఈత సరదా కోసం బాలురు, యువకులు వ్యవసా య బావులు, చెరువులు, కుంటల వద్ద వెళ్తున్నారు. కొందరు వచ్చీరాని ఈత కారణంగా ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు ఊబిలో కూరుకుపోయి శ్వాస విడుస్తున్నారు. చెరువులు, కుంటల్లో మొరం కోసం ఇష్టారాజ్యంగా తవ్వకాలతో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇవేవీ గమనించకుండా చేపల వేటకు వెళ్లిన వారు ప్రమాదం కొనితెచ్చుకుంటున్నారు. జలాశయాల్లో నీరు అధికంగా ఉన్నప్పుడు తప్పనిసరిగా కాపలాదారు(లస్కర్)ల పర్యవేక్షణ ఉండాలి. నీటిలోకి దిగకుండా నియంత్రించాలి. ప్రవాహ ఉధృతి ఉన్నచోట, లోతైన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఉపాధి పనుల కింద నిర్మించి చెక్‌డ్యాంలు, కుంటలు, ఫారం పాండ్లు ఉన్న చోట స్థానికంగా పంచాయతీ అధికారులు దండోరా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలి. కానీ యంత్రాంగం రక్షణ చర్యలు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది.

**పరీవాహకంలో ప్రమాదాలు**

కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది మొదలై.. చింతలమానెపల్లి మండలం రణవెల్లి, భూరెపల్లి, కోర్సిని, దిందా, చిత్తాం, గూడెం, బూరుగూడ, బెజ్జూర్ మండలం సోమిని, తలాయి, పెంచికల్‌పేట్ మండలంలోని మురళీగూడ, దహెగాం మండలం మొట్లగూడ, రాంపూర్ గ్రామాల వరకు ప్రవాహం ఉంటుంది. అలాగే పెన్‌గంగ నది సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, టోంకిని, వెంకట్రావుపేట, లోనవెల్లి, కౌటాల మండలంలోని వీరవెల్లి, తాటిపల్లి, వీర్దండి, గుండాయిపేట వరకు ప్రవహిస్తుంది. సమీప గ్రామాల్లోని ప్రజలు నిత్యం ఇక్కడికి సాన్నాల కోసం నదుల వద్దకు వెళ్తుంటారు. మహారాష్ట్రకు నాటు పడవల్లోనూ ప్రయాణాలు సాగిస్తుంటారు. నదుల ఒడ్డున రక్షణకు నీటి జాకెట్లు, గాలి నింపిన ట్యూబ్‌లు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రజల తాకిడి ఎక్కువగా ఉన్న పరీవాహక ప్రాంతాల్లోనే తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి. స్నానాలకు అనువైన ప్రదేశాలను గుర్తించడం లేదు. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇటీవలి ఘటనలు**

- చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన సెడ్మెక సుమన్(18) జూలై 10న దిందా వాగు దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందాడు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని వేదన మిగిలింది.
- చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన జోడి గురుదాస్(28) ఆగస్టు 23న పశువులను నీటి కుంటలో కడిగేందుకు తీసుకెళ్లాడు. మట్టి తవ్వకాలతో కుంట లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో పడి మృతి చెందాడు.
- మే 24న కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన పిప్పిరి హేమంత్(16) పెద్దవాగులో సాన్నం చేసేందుకు వెళ్లాడు. వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయాడు.
- కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బోయర్ లక్ష్మి(13), మహారాష్ట్రలోని ఎటపల్లికి చెందిన సిండే హన్షిక(11) మే 23న వ్యవసాయ చేనులోని చెరువు కుంట వద్ద ఆడుకుంటూ నీటిలో మునిగి మృతి చెందారు.

**పిల్లలపై దృష్టి సారించాలి**

బాలలు ఇంట్లో చెప్పకుండా స్నేహితులతో కలిసి స్నానాలకు వెళ్తుంటారు. వర్షాకాలం నేపథ్యంలో పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. నదులు, వాగుల వద్దకు పంపించొద్దు. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– ఎండీ వహీదుద్దీన్, డీఎస్పీ, కాగజ్‌నగర్

## ‘కార్మిక హక్కుల సాధనకు పోరాటం’



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమలు, సింగరేణి పరిరక్షణ కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతున్నామని కోల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి మండ రమాకాంత్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం విజయ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బొగ్గు పరిశ్రమల పరిరక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జూలై 23 నుంచి సెప్టెంబర్ 17 వరకు దేశవ్యాప్త ప్రజా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ప్రభావిత గ్రామాల ప్రజలను చైతన్యపరుస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బొగ్గు బకాయిలు రూ.42,732 కోట్లను వెంటనే చెల్లించాలని, బొగ్గు ఉత్పత్తిలో 50 శాతం పర్మినెంట్ కార్మికుల ద్వారా తీయాలని డిమాండ్ చేశారు. 2024- 25 సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలపై 40 శాతం వాటా చెల్లింపు తేదీని ప్రకటించాలన్నారు. కోల్ ఇండియా మాదిరిగా అలవెన్స్‌లపై ఐటీ రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించి, క్వార్టర్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమాల్లో బీజేపీ సీనియర్ నాయకులు ఆంజనేయులుగౌడ్, పెన్షనర్స్ అసోసియేషన్ కేంద్ర కార్యదర్శి లగిశెట్టి కమలాకర్, నాయకులు తాళ్లపెల్లి రాములు, శంకర్, రాజుయాదవ్, చందు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో నాలుగో విడత వాక్ ఇన్ అడ్మిషన్లు ఈ నెల 15 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఆన్‌లైన్, వివిధ దశలతో దరఖాస్తు చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. కొత్త వారు ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ, ఏటీసీలో నేరుగా హాజరై సీటు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామానికి చెందిన సురేష్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 7.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. బియ్యాన్ని విచారణ నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి అప్పగిస్తామని తెలిపారు. సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### వివాహిత అదృశ్యం


రాథోడ్ తాయిబాయి (ఫైల్)

తానూరు: మండలంలోని ఝరి(బి)తండాకు చెందిన వివాహిత రాథోడ్ తాయిబాయి ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఉదయం 9 గంటలకు కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా జాడ దొరకలేదు. దీంతో తాయిబాయి భర్త రాథోడ్ దిగంబర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ జుబేర్ వెల్లడించారు.

### అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

నిర్మల్: నర్సాపూర్(జి) మండల కేంద్రం శివారులోని రైతు కోండ్ర రమేశ్‌కు చెందిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంటపై గురువారం అర్ధరాత్రి అడవి పందులు దాడిచేసి ధ్వంసం చేశాయి. శుక్రవారం వచ్చి చూసేసరికి చేతికి వచ్చిన పంట పనికిరాకుండా పోయిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

### వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్తిరెడ్డి


సత్తిరెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్పీడీసీఎల్ విద్యుత్ శాఖ టీఈఈ 1104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన బొమ్మ సత్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబు తెలిపారు. శుక్రవారం వరంగల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో 16 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. సత్తిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులను సాధించడం కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

### స్ట్రక్చరల్ సమావేశం బహిష్కరణ

శ్రీరాంపూర్: కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న మొండివైఖరికి నిరసనగా సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాన్ని బహిష్కరించినట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో శుక్రవారం సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరగాల్సి ఉంది. క్రితం సారి జరిగిన సీఎండీ స్ట్రక్చరల్ సమావేశం, రెండు సార్లు జరిగిన డైరెక్టర్(పా) స్థాయి సమావేశాల్లో కుదుర్చుకున్న ఒప్పందాల అమలుకు ఉత్తర్వులు ఇవ్వకుండా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు. కార్మికులకు సొంతింటి పథకం కల్పించడంపై ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికీ సమావేశం కాలేదని, ఇంకా ఇతర ప్రధాన సమస్యలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు.

### బాలుడి అప్పగింత


బాలుడిని తండ్రికి అప్పగించిన అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటి నుంచి పారిపోయి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి జిల్లాకు వచ్చిన మైనర్ బాలుడిని జిల్లా బాలల సంరక్షణ అధికారి బొల్ల మహేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కాగజ్‌నగర్ స్టేషన్‌లో ఓ రైలులో బాలుడిని గుర్తించి విచారించారు. సికింద్రాబాద్‌లోని పార్శిగుట్ట ప్రాంతం నుంచి అతడు వచ్చినట్లు గుర్తించారు. జిల్లా కేంద్రంలోని బాల రక్షభవన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలుడి తండ్రిని పిలిపించి అప్పగించారు. డీసీపీవో మహేశ్ మాట్లాడుతూ పిల్లలపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ ఉన్నారు.

# అజ్ఞాతంలోనే ముగిసిన వెంకటి ప్రస్థానం

- 30ఏళ్లుగా మావోయిస్టుల్లోనే 'జాడి'
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి
- చంద్రవెల్లి గ్రామంలో విషాదం


జాడి వెంకటి(ఫైల్)

బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్: విప్లవ సిద్ధాంతానికి ఆకర్షితుడైన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి వెంకటి అలియాస్ భిమల్ అలియాస్ సురేష్(56) విప్లవ ప్రస్థానం అజ్ఞాతంలోనే ముగిసింది. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబండ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో వెంకటి ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు శుక్రవారం ధ్రువీకరించారు. 30ఏళ్లుగా దండకారణ్యం కేంద్రంగా విప్లవ కార్యకలాపాలు సాగించాడు. 1996 ప్రాంతంలో అజ్ఞాతంలోకి వెళ్లి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ ప్రింటింగ్ ప్రెస్, ఇతర కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. ఆయుధాల సామగ్రిని వివిధ ప్రాంతాల నుంచి రవాణా చేయడంలో సిద్ధహస్తుడిగా పేరుగాంచాడు. మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్ ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. తెలంగాణలో కార్యకలాపాలు సాగించకపోవడం, హింసాత్మక కార్యకలాపాల్లో వెంకటి భాగస్వామ్యం అంతంత మాత్రం కావడంతో ఆయన పేరు స్థానిక పోలీసు రికార్డుల కెక్కలేదు. 15ఏళ్ల క్రితం ఝార్ఖండ్ రాష్ట్రం రూర్కేలాలో ఓసారి పోలీసులకు పట్టుబడ్డాడు. మూడేళ్ల జైలు జీవితం తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకే వెళ్లాడు. ఇప్పటివరకు పోలీసులకు చిక్కలేదు. ఎన్‌కౌంటర్‌లో మృతితో రహస్య జీవితం ముగిసింది. వెంకటిపై ఆయా రాష్ట్రాల్లో రూ.10లక్షల రివార్డు ఉంది. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

**పీపుల్స్‌వార్ సానుభూతి పరుడిగా...**

బెల్లంపల్లి బస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(అద్దాల బడి)లో వెంకటి పదో తరగతి వరకు చదివాడు. 1985లో తన గ్రామానికి చెందిన పుష్పను ప్రేమించి శివాలయంలో పెళ్లి చేసుకున్నాడు. గ్రామ సుంకరిగా పని చేస్తూనే వ్యవసాయం చేసేవాడు. పీపుల్స్‌వార్, సికాస సానుభూతి పరుడిగా ఉన్న అతడిపై పోలీసులు ప్రత్యేక నిఘాతో వేధింపులకు గురి చేశారనే ప్రచారం ఉంది. దీంతో ఏడాదిపాటు బెల్లంపల్లి అంబేడ్కర్‌నగర్‌లో మకాం పెట్టాడు. అయినా పోలీసుల వేధింపులు ఆగకపోవడంతో భార్య పుష్పతో కలిసి దండకారణ్యంలోకి వెళ్లాడు. ఆమె టెక్నికల్ టీంలోనే సభ్యురాలిగా ఉన్నట్లు సమాచారం.

**తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు**

జాడి పోశమ్మ, ఆశయ్య దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. ఇద్దరు కుమార్తెలు రామక్క, సుజాత, కుమారుడు వెంకటి ఉన్నారు. వీరిలో రామక్క కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో, తల్లిదండ్రులు 15ఏళ్ల క్రితం వృద్ధాప్యంతో చనిపోయారు. తల్లిదండ్రులు మృతిచెందిన సమయంలోనూ అంత్యక్రియలకు రాలేదు. తల్లిదండ్రులు నివాసం ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. ఆశయ్య సింగరేణి కంపెనీలో కార్మికుడిగా పనిచేశాడు.


**పేదలకు సేవ చేయడానికి చేరాడు**



గ్రామంలో వెంకటి అంత్యత సాదాసీదాగా ఉండేవాడు. అందరితో ఎంతో కలివిడిగా ఉండే వెంకటి అజ్ఞాతంలోకి వెళ్లే వరకు పీపుల్స్‌వార్‌తో సంబంధాలు ఉండేవనేది నమ్మలేకపోయాం. రహస్య జీవితంలోకి వెళ్లిన వెంకటి ఒక్కసారి కూడా గ్రామం ముఖం చూడలేదు. తల్లిదండ్రులు, అక్క, అల్లుడు చనిపోయినా రాలేదు. పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో విప్లవ బాట పట్టాడు.

– కొమ్మెర లక్ష్మణ్, మాజీ సర్పంచ్, చంద్రవెల్లి

### దూకిన 'మత్తడి'


దిగువకు వెళ్తున్న వరద నీరు

తాంసి: మండలంలోని వడ్డాడి సమీపంలో గల మత్తడివాగు ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుంది. శుక్రవారం ఇన్‌ఫ్లో 1494 క్యూసెక్కులు ఉండగా ఒక గేటు ఎత్తి అంతే మొత్తంలో ఔట్‌ఫ్లో దిగువకు వదిలినట్లు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు. ప్రస్తుతం 277 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉండేలా స్థిరీకరిస్తున్నట్లు వెల్లడించారు.

### 'సాత్నాల' పరవళ్లు..


ఉరకలేస్తున్న వరద నీరు

సాత్నాల: మండలంలోని సాత్నాల ప్రాజెక్టుకు శుక్రవారం 2,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఈ మేరకు రెండు గేట్లు ఓపెన్ చేసి 2,380 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీ కాగా, ప్రస్తుతం 1.046 టీఎంసీగా ఉన్నట్లు వెల్లడించారు.

# గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

గుడిహత్నూర్: ఆదిలాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని తోషం గ్రామ శివారులో పట్టుకున్న గంజాయి మొక్కలకు సంబంధించి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీసీఎస్, ఇచ్చోడ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి తోషం శివారులో మర్సకోల దేవురావు అనే రైతు చేనులో పత్తిలో అంతర పంటగా సాగు చేస్తున్న 627 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ మార్కెట్లో సుమారు రూ.62.70 లక్షలు ఉంటుందని వెల్లడించారు. గంజాయి సాగు, విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు వారికి రివార్డు అందజేస్తామన్నారు. అనంతరం ఆయన స్థానిక ఠాణాలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, సీసీఎస్ సీఐ పి.చంద్రశేఖర్, ఇచ్చోడ సీఐ రాజు, ఎస్సై శ్రీకాంత్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడ్డ గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

**నార్నూర్‌లో ఒకరి అరెస్టు..**

నార్నూర్: గంజాయి సాగు చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాదిగూడ మండలం పర్సువాడ పంచాయతీ పరిధిలోని సారుగూడకు చెందిన మార్సుకోల జంగు తన పొలంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం దాడులు జరిపి 16 మొక్కలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

# అంగన్‌వాడీ కార్యకర్తపై కులవివక్ష

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం చిన్న బెండార గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇగురపు లక్ష్మిపై గ్రామస్తులు కుల వివక్ష చూపుతున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం చిన్న బెండార గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు. ఐదేళ్ల క్రితం చిన్న బెండారకు అంగన్‌వాడీ టీచర్ ఇగురపు లక్ష్మి అనే దళిత మహిళ బదిలీపై వచ్చిందన్నారు. అప్పటి నుంచి అడపాదడపా ఆమెపై స్థానికులు కొందరు కుల వివక్ష చూపుతున్నా పట్టించుకోకుండా విధులు నిర్వర్తిస్తుందని తెలిపారు. పిల్లల కోసం వండిన అన్నం కూడా తినకుండా బహిష్కరిస్తున్నారని తెలిపారు. గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించి సహపంక్తి భోజన కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నివేదికను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు, అట్రాసిటీ కమిటీ సభ్యుడు రేగుంట కేశవ్‌రావు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు, అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు అశోక్ మహోల్కర్, నాయకులు గోపాల్ నాయక్, ఇగురపు గణేష్, శ్యాంరావు, పొన్నాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.


విచారణ చేపడుతున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

# విధుల్లో ఉన్న అటవీ సిబ్బందిపై దాడి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్‌లో అటవీ, బేస్‌క్యాంపు సిబ్బందిపై దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు శుక్రవారం దాడి చేశారని తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మారావ్ తెలిపారు. పక్కా ప్రణాళికతో కారంచల్లి కర్రలతో దాడి చేశారని, దీంతో భయభ్రాంతులకు గురైన తమ సిబ్బంది అక్కడి నుంచి పరుగులు తీశారని పేర్కొన్నారు. దాడికి గురైన వారిలో ఎఫ్ఎస్వో బాలకృష్ణ, బీట్ ఆఫీసర్ పరమేశ్వర్, బేస్‌క్యాంపు వాచ్‌మెన్ రాజేందర్ ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


గాయపడిన అటవీ, బేస్‌క్యాంప్ సిబ్బంది

# జనరేటర్ అమ్ముకున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అద్దెకు తీసుకున్న జనరేటర్‌ను యజమానికి తెలియకుండా విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన షకీల్‌ఖాన్ అశోక్‌రోడ్‌లో ఎలక్ట్రానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. అతని వద్ద నుంచి అంబేద్కర్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీమ్ జనరేటర్ అద్దెకు తీసుకున్నాడు. అయితే యజమానికి తెలియకుండా దానిని విక్రయించాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

**రుణం పేరిట మోసం చేసిన వ్యక్తిపై..**

ఆదిలాబాద్‌టౌన్: లోన్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని బోరిగామకు చెందిన రాథోడ్ సందీప్, ఆయన భార్య వైటీసీలో గతంలో శిక్షణ పొందారు. అక్కడే వార్డెన్‌గా పనిచేస్తున్న ఉట్నూర్ మండలం దండెపల్లికి చెందిన నిందితుడు సోయం బలిరాం శిక్షణ తర్వాత సెట్విన్ సర్టిఫికెట్‌పై రూ.2లక్షల రుణం ఇప్పిస్తానని బాధితులను నమ్మించాడు. రూ.20వేలు తీసుకొని ఇప్పటివరకు రుణం ఇప్పించకపోగా, డబ్బులు సైతం తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

**విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై..**

సాత్నాల: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. భోరజ్ మండలం గిమ్మ పంచాయతీ కార్యదర్శిగా రేఖారెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం గ్రామానికి చెందిన సదాలి కిరణ్ మద్యం మత్తులో ఆమె వద్దకు వెళ్లి తన ఇంటి ముందు నీరు నిల్వ ఉంటుందని, సీసీ రోడ్డు పగలగొట్టి, పైపులు వేయించాలని కోరాడు. ప్రస్తుతం నిధులు లేవని, విడుదలైన వెంటనే చేయిస్తానని ఆమె చెప్పినా వినిపించుకోకుండా అసభ్యపదజాలంతో దూషించాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నిందితుల రిమాండ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం తుంపల్లి శివారులో గత నెల 18న కెరమెరికి చెందిన పశువుల వ్యాపారులపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టు హాజరుపర్చినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. ఈ కేసులో నయ్యూమ్ ఖురేషి, ఎండీ హాఫీజ్, ఖలీమ్ మొహ్మద్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని పేర్కొన్నారు.

# అమ్మ పేరిట మొక్క.. పచ్చదనం పక్కా

- పాఠశాలల్లో పచ్చదనం పెంచే యజ్ఞం
- 'ఏక్ పేడ్ మా కే నామ్ పే' కార్యక్రమం
- విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలుకు ప్రత్యేక కార్యాచరణ

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| నిర్మల్ | 842 | 1,12,300 |
| ఆదిలాబాద్ | 1,279 | 1,23,900 |
| మంచిర్యాల | 847 | 1,05,600 |
| కుమరంభీమ్ | 1,148 | 1,18,200 |


ఉత్సాహంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా విద్యార్థులు


నాటిన మొక్కతో కూడిన వివరాలను నమోదు చేసే కేంద్ర ప్రభుత్వ పోర్టల్ ఇదే..

నిర్మల్‌ఖిల్లా: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, 'ఏక్ పేడ్ మాకే నామ్ పే' పేరుతో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలనే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా పాల్గొని పాఠశాల ఆవరణలతోపాటు గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ కృషి చేస్తోంది.

**ప్రత్యేక కార్యాచరణ..**

కార్యక్రమం అమలు కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. జిల్లా, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించింది. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించింది. ఈ కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నారు. నాటిన మొక్కలను పరిరక్షించేందుకు కూడా తగిన కార్యాచరణ చేపడుతున్నారు.

**సమష్టిగా..**

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా పాల్గొంటే ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 లక్షలకు పైగా మొక్కలు నాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొక్కలు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆధ్వర్యంలో పంపిణీకి అందుబాటులో ఉన్నాయని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.

**మొక్క నాటి.. పోర్టల్‌లో అప్‌లోడ్..**

తల్లి పేరిట మొక్క నాటిన సందర్భంలో విద్యార్థులు ఫొటో తీసి, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని www. ecoclubs. eduvation. gov. in పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ పోర్టల్‌లో పాఠశాల వివరాలు, యుడైస్ కోడ్, విద్యార్థి పేరు, తండ్రి పేరు వంటి వివరాలను నమోదు చేసి, మొక్క నాటే సమయంలో తీసిన ఫొటోను జతచేయడం ద్వారా విద్యార్థి పేరిట ధ్రువీకరణ పత్రం, ప్రశంసాపత్రం జనరేట్ అవుతుంది.

**పర్యావరణ పరిరక్షణ..**

ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల ఆవరణలు, గ్రామాలు పచ్చదనంతో కళకళలాడనున్నాయి. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడంతోపాటు, సమాజంలో పచ్చదనం విస్తరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన రేఖేందర్ రవి(45) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రవి ఆరేళ్ల క్రితం జీవనోపాధి కోసం ఓ ప్రైవేటు ఫైనాన్స్‌తో లారీ కొన్నాడు. తన బంధువు జీవన్ లారీ కొనుగోలు చేయగా.. ఫైనాన్స్‌లో జమానత్ ఉన్నాడు. రవి ఫైనాన్స్ డబ్బులు చెల్లించి తన లారీ విక్రయించాడు. క్లియరెన్స్ కోసం ఫైనాన్స్‌లో అడుగగా.. జమానత్ ఉన్న లారీ ఫైనాన్స్ డబ్బులు చెల్లిస్తేనే క్లియరెన్స్ ఇస్తామని చెప్పారు. దీంతో జీవన్‌ను అడుగగా.. డబ్బులు లేవని, కట్టలేనని చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన రవి ఈ నెల 9న ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### పురుగుల మందు తాగి..

తాండూర్: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని రేచిని గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేష్ తాపీమేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వెంకటేష్ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు..

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయల్‌గార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి కస్తూరి గోపి(42) మృతిచెందాడు. ఇక్కడికి సమీపంలోని రైస్‌మిల్లు కాలనీ వద్ద నివాసం ఉండే గోపి గురువారం రాత్రి పనిమీద బయటకు వచ్చాడు. రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### పాముకాటుకు ఎద్దు..

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీకి చెందిన బజ్జూరి శ్రావణ్ అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాముకాటుకు మృత్యువాత పడింది. పత్తి చేనులో గడ్డి తీసేందుకు అరక తోలుతుండగా ఎద్దును విష నాగు కాటేసింది. ఎద్దు విలువ రూ.80వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

# సొంతింటికే కార్మికుల మొగ్గు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి
- బ్యాలెట్ పత్రాల లెక్కింపు

శ్రీరాంపూర్: కార్మికులు సొంతింటి పథకానికే మొగ్గు చూపుతున్నారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. కార్మికులకు కంపెనీ క్వార్టర్ కావాలా? సొంతింటి పథకం కావాలా అనే దానిపై గురు, శుక్రవారాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా గనులపై బ్యాలెట్ పత్రాలతో కార్మికుల అభిప్రాయాలు సేకరించారు. శ్రీరాంపూర్ ఏరియా బ్యాలెట్ పత్రాలను శుక్రవారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో లెక్కించారు. 60శాతం మంది కార్మికులు బ్యాలెట్ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 4543 మంది సొంతింటి పథకం కావాలని, 31 మంది కంపెనీ క్వార్టరే కావాలని ఓటేశారని తెలిపారు. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో వచ్చిన అభిప్రాయాలను యాజమాన్యానికి త్వరలోనే సమర్పిస్తామని తెలిపారు. 40ఏళ్లు కంపెనీలో సర్వీసు చేసిన కార్మికులు రిటైర్డ్ తర్వాత సొంతిళ్లు కూడా కట్టుకోలేకపోతున్నారన్నారు. యూనియన్ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు వెంగళ శ్రీనివాస్, తోడే సుధాకర్, పెర్క సదానందం, శ్రీపతి బానేశ్, కిషన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మిడివెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న నాయకులు


# రక్షణలో ఆదర్శంగా నిలవాలి

శ్రీరాంపూర్: రక్షణలో ఆదర్శంగా నిలవాలని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. 55వ రక్షణ పక్షోత్సవాల్లో ద్వితీయ బహుమతి సాధించిన ఆర్కే న్యూటెక్ గని ఉద్యోగులను ఆయన అభినందించారు. శుక్రవారం గనిపై నిర్వహించిన ఈ అభినందనలో ఆయన మాట్లాడారు. గని ఉద్యోగులు రక్షణలో ముందున్నారని, ఇతర గనులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ కూడా సాధించడం మరో మైలురాయిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, గ్రూప్ ఏజెంట్ కే.రాజేందర్, గని మేనేజర్ కురుపాటి శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, రక్షణ అధికారి కొట్టే రమేష్, సీనియర్ సంక్షేమ అధికారి పాల్ సృజన్ పాల్గొన్నారు.


ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం ఎం.శ్రీనివాస్

# రెవెన్యూ శాఖలో పనులు త్వరగా పూర్తి చేయాలి

దండేపల్లి/జన్నారం: రెవెన్యూ శాఖలో పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. శుక్రవారం ఆయన దండేపల్లి, జన్నారం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులతో మాట్లాడారు. విధుల్లో అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా నిర్వర్తించి మంచి పేరుతెచ్చుకోవాలని అన్నారు. భూభారతి దరఖాస్తులు వివరాలు తెలుసుకున్నారు. సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ తదితర పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో దండేపల్లి డీటీ మాధవి, ఆర్ఐ భూమన్న, జన్నారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డీటీ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


జన్నారంలో మాట్లాడుతున్న చంద్రయ్య

### కిరాణ షాపులో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం కుమ్మరికుంటలోని ఓ కిరాణ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. షాపు యజమాని రమేష్ రోజు మాదిరిగానే రాత్రి 10.30 గంటలకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం వెళ్లి చూసే సరికి షెట్టర్ తాళం పగలగొట్టి ఉంది. కౌంటర్‌లో రూ.3వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.